మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు?

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య

వేములవాడ, అక్టోబర్ 1: 'మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు? కార్పొరేషన్‌కు కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేస్తరు?' అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినందుకే రాష్ట్రంలోని 50 లక్షల మంది కాపులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని గుర్తుచేశారు. వంద రోజుల్లోనే కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమైనప్పటికీ.. కమిటీని ఎప్పుడు నిర్ణయిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు ఇవ్వాలని నిరసన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేటలో రూ. 500 కోట్ల విలువైన భూమి ఇవ్వగా, ప్రభుత్వం ఇచ్చే రూ.50 కోట్లు సరిపోవని అన్నారు.

కేయూలో విజిలెన్స్ దాడులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనంలో విచారణ చేపట్టారు. మాజీ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మాజీ వీసీ రమేశ్ అక్రమాలపై అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో విజిలెన్స్ అధికారులు స్వయంగా యూనివర్సిటీకే వచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ నరసింహచారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారి ఫైళ్లను పరిశీలించారు.

హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ

గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్

ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి రావడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. ప్రభుత్వ తరపు లాయర్ల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు.

కారు బోల్తా.. ఐదుగురి దుర్మరణం

- మృతులంతా ఒకే కుటుంబం వారు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన మొహిజొద్దీన్ తన మ్యాక్స్ వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా భైంసాకు వెళ్లివస్తున్నాడు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మొహిజొద్దీన్ (65), ఆయన అల్లుడు ఖాజా మొయినొద్దీన్ (40), మనుమలు ఉస్మాన్‌నొద్దీన్ (11), ఫరొద్దీన్ (12), మహమ్మద్ అలీ (8) మృతి చెందగా.. కారులో ప్రయాణిస్తున్న ఆయేషా, ఏక్రాలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు

కారేపల్లి, అక్టోబర్ 1: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. గుట్టకిందగుంపునకు చెందిన ఉండం సూర్యనారాయణ (45), సుగుణ (42) దంపతులు బైక్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు వెళ్లి వస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ సమీపంలోని సోలార్ పవర్‌ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నక్క వెంకటేశ్(35), ఆలియాతండాకు చెందిన ధరావత్ రాజు కారేపల్లి నుంచి పవర్‌ప్లాంట్ వైపు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సూర్యనారాయణ, సుగుణ, వెంకటేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇల్లెందు దవాఖానకు తరలించారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. పదోవార్డు వాసులు మాట్లాడుతూ మోటర్ కాలిపోవడంతో నీళ్లు రాక అవస్థలు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి హామీతో ఆందోళన విరమించారు. – నేరేడుచర్ల

గుండూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ధర్నా

పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరు జెడ్పీహెచ్ఎస్ ఎదుట మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. పాఠశాలలో మూత్రశాలలు నిర్మించినా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. మూత్రవిసర్జన కోసం బహిరంగ ప్రదేశాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టకుండా స్థానిక ప్రజాప్రతినిధులు – కల్వకుర్తి రూరల్

సాగర్ కాల్వలో ముగ్గురు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం లభించగా మిగతా ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. భద్రాద్రి జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్ సోమవారం ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం దానవాయిగూడెంలో మద్యం సేవించారు. తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. రోండ వెంకటేశ్వర్లు ఆటోలోనే నిద్రించగా మిగిలిన ముగ్గురు సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల దుస్తులు కాల్వ గట్టుపై కనిపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు. మరో ఇద్దరు ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది.

పేదల జోలికొస్తే ఊరుకోం:కూనంనేని

సుబేదారి/పోచమ్మమైదాన్, అక్టోబర్ 1: హైడ్రా పేరు తో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- కొంతకాలంగా అఘాయిత్యం
- 4 నెలల గర్భిణీగా తేల్చిన వైద్యులు

గీసుగొండ, అక్టోబర్ 1: వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలిక 8వ తరగతి చదువుతున్నది. ఆమెకు తండ్రి లేడు. అదే గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) బాలికకు మాయమాటలు చెప్పి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాలిక ఆరోగ్య పరిస్థితిని గమనించిన తల్లి నిలదీయగా విషయం చెప్పింది. మంగళవారం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. బాలిక 4 నెలల గర్భిణిగా నిర్ధారించారు. సాంబయ్యపై పోక్సో కేసు నమోదైంది.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు

సత్తాచాటిన నాగర్‌కర్నూల్ జిల్లావాసులు

చారకొండ/అమ్రాబాద్, అక్టోబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు యువకులు ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబం దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు నరేశ్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. హైదరాబాద్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పట్టుదలతో చదివి పోటీ పరీక్షలు రాయగా.. ఇటీవల హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా, సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

చంద్రశేఖర్

నరేశ్‌రెడ్డి

మాచారానికి చెందిన చంద్రశేఖర్..

అమ్రాబాద్ మండలం మాచారానికి చెందిన చంద్రశేఖర్ డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌కు సాంఘిక శాస్త్రంలో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 15వ ర్యాంక్, భాషా పండిత్ తెలుగులో 3వ ర్యాంక్ సాధించాడు.

మద్యం తాగించి యువతిపై గ్యాంగ్‌రేప్

భూపాలపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

గిర్మాజీపేట, అక్టోబర్ 1: మద్యం తాగించి యువతిపై ఇద్దరు యువకులు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. గత నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూపాలపల్లి ప్రాంతానికి చెందిన యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్, ఫోన్‌లో మాట్లాడుకోవడంతో పరిచయం మరింత బలపడింది. యువకుడు తన ఇద్దరు మిత్రులతో కలిసి గత నెల 15న యువతిని నమ్మించి కారులో వరంగల్ నగరానికి తీసుకొచ్చాడు. హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని యువతికి బీర్లు తాగించి ఇద్దరూ లైంగికదాడికి పాల్పడ్డారు. యువతి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదైంది.

ముందస్తు బతుకమ్మ, దసరా సంబురాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

జనగామ, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్ సెయింట్ మేరీస్ పాఠశాలలో డైరెక్టర్ తుమ్మ శ్రీలతారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వెంపలి చెట్టుకు పూజ చేసి ముందస్తు బతుకమ్మ సంబురాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలోని ప్రతి మహిళా ఇష్టపడే గొప్ప పండుగ బతుకమ్మ వేడుకలన్నారు. పాఠశాలలో వేడుకలు జరపడం ద్వారా జాతీయ సమైక్యత పెంపొందుతుందన్నారు. ప్రిన్సిపాల్ జైమోన్ థామస్ ఆధ్వర్యంలో రావణాసురుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి, రాజిరెడ్డి, ప్రమీల, కటకం జ్యోతి, వాణిశ్రీ, గుణవర్ధన్, జ్యోతి, రాజు, నరసింహా, నర్మద, ప్రవీణ, హేమలత, శైలజ, శాలిమ్, సరిత, నరేశ్, శ్రీధర్, పాఠశాల పీఆర్వో రంగరాజు ప్రసాద్ పాల్గొన్నారు.

కంచనపల్లి సొసైటీ చైర్మన్ అనర్హతపై హైకోర్టుస్టే

రఘునాథపల్లి, అక్టోబర్ 1: మండలంలోని కంచనపల్లి సొసైటీ చైర్మన్ చీమలపాటి రవీందర్‌జీ అనర్హతపై హైకోర్టు స్టే ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నత న్యాయస్థాన ఉత్వర్వుల కాపీని రవీందర్ జీ మంగళవారం డీసీవో రాజేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ నేపథ్యంలో రవీందర్‌జీ చైర్మన్‌గా కొనసాగనున్నారు. సొసైటీకి చెందిన రూ.17.25 లక్షలు దుర్వినియోగమైనట్లు గుర్తించిన జిల్లా కోఆపరేటివ్ అధికారులు సొసైటీ అధ్యక్షుడిని అనర్హుడిగా ప్రకటించారు. దీనిని సవాల్ చేస్తూ రవీందర్‌జీ హైకోర్టును ఆశ్రయించగా. న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై డీసీవో రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా చైర్మన్ అనర్హతపై హై కోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో చైర్మన్‌గా రవీందర్‌జీ బాధ్యతలు కొనసాగిస్తారని తెలిపారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

నర్మెట, అక్టోబర్ 1: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది చూడాలని జిల్లా పంచాయతీ అధికారి స్వరూప అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వాటర్‌మెన్లకు నాలుగు రోజులు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. మంచినీటి సమస్య, బోరు మోటార్ రిపేర్లు, లీకేజీలు, హ్యాండ్ పంపుల రిపేరుకు సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. ట్రైనింగ్ అనంతరం వాటర్‌మెన్లకు సర్టిఫికెట్ ఇస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ శ్రీకాంత్, ఎంపీడీవో అరవింద్‌చౌదరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రజ్వల్ పాల్గొన్నారు.

నాటక సమాజాల సమాఖ్య జిల్లా కార్యవర్గం ఎన్నిక


మాట్లాడుతున్న నెల్లుట్ల రవీందర్‌రావు

లింగాలఘనపురం; అక్టోబర్ 1 : మండలంలోని నెల్లుట్ల శ్రీనివాస్‌నగర్‌లో నెల్లుట్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నెల్లుట్ల రవీందర్‌రావు నివాసంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మారదోజు సదానందం , రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు బాలాజీ అధ్వర్యంలో ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షుడిగా అక్కినపెల్లి రవీందర్, గౌరవాధ్యక్షుడిగా నెల్లుట్ల రవీందర్‌రావు, ముఖ్యసలహాదారుగా కొత్త వెంకటరెడ్డి, కన్వీనర్‌గా నంచర్ల వైకుంతం, ప్రధాన కార్యదర్శిగా వంగ వెంకటేశ్వర్లు, కోశాధికారిగా చెరుకు పాపయ్య, సహాయకార్యదర్శిగా శ్రీరామోజు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా మన్నె యాదవరెడ్డి, బీమగాని అంజయ్య, సోమయ్య, కే రాజు, ఆంజనేయులు, వంగ పరమేశ్, కామిడి రాజశేఖర్‌ను ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' సర్వే

మంత్రి పొంగులేటి

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, అక్టోబర్ 1 : 'వన్ స్టేట్, వన్ కార్డు' దిశగా ఈ నెల 3వ తేదీ నుంచి అన్ని జిల్లాల్లో చేపడుతున్న 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి సీఎస్ శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పొంగులేటి మాట్లాడుతూ జిల్లాలోని జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మున్సిపల్ వార్డు, గ్రామ పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని ప్రతి ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను సేకరించాలని తెలిపారు. నిర్దేశించిన ప్రొఫార్మాలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. దీన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారులు పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఆర్డీవోలు ప్రత్యేక అధికారులుగా పనిచేస్తారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా క్షేత్ర స్థాయిలో జరిగే సర్వే పనుల్నీ పర్యవేక్షిస్తారని సూచించారు. ఈ ప్రక్రియను ఈ నెల 8వ తేదీలోపు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. 9న స్క్రూటినీ చేసి, 10న రిపోర్ట్ అందించాలన్నారు. అదేవిధంగా జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. నిబంధనల మేరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేశ్ కుమార్, ఆర్డీవో వెంకన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత రంగాలకు రుణాల మంజూరు : కలెక్టర్

ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో రుణాల మంజూరు, రెన్యూవల్‌పై అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేశ్ కుమార్, బ్యాంకర్లతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రుణమాఫీ జరిగిన రైతులకు వెంటనే రుణాలను రెన్యూవల్స్ చేయాలని ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలు, మహిళా శక్తి రుణ లక్ష్య సాధన 120 శాతంగా ఉండాలని సూచించారు. అనంతరం ఈ నెల 6వ తేదీన కేరళ నుంచి జిల్లాకు రానున్న నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీమ్ పర్యటనపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని దేవరుప్పుల, స్టేషన్ ఘన్‌పూర్, జనగామ, కొడకండ్ల మండలాల్లోని 20 గ్రామ పంచాయతీల్లో బృందం పర్యటిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, డీపీవో స్వరూప, జడ్పీ సీఈవో సరిత, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట అంగడి వేలం మళ్లీ వాయిదా

లింగాలఘనపురం, అక్టోబర్ 1 : మండలంలోని నవాబుపేట అంగడి వేలం వాయిదా పడిందని ఆలయ ఈవో వంశీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనగామ కలెక్టరేట్‌లో వేలం నిర్వహించగా ముగ్గురు సీల్డు టెండర్లు వేశారని, అత్యధికంగా రూ.80 లక్షల 9,999 వేశారన్నారు. కానీ బహిరంగ వేలంలో ఎవరూ పాల్గొనలేదని, అనుకున్న ధర రాకపోవడంతో వాయిదా వేశామన్నారు. గతంలో ఈ-టెండర్ ద్వారా ఆలయానికి రూ.కోటీ 5 లక్షల ఆదాయం లభించిందన్నారు. సెప్టెంబర్ 24న వేలం చేపట్టగా రూ.79 లక్షలే పలకడంతో, ఈ రోజు మళ్లీ వేలం చేపట్టామన్నారు. మరోసారి ఈ నెల 16న మళ్లీ వేలం నిర్వహించనున్నట్లు ఈవో వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది సీహెచ్ రాజేందర్ రెడ్డి, అశోక్, రవితేజ, శ్రీనివాస్, రమేశ్, ఎల్లగౌడ్, కేకే రాములు, మోహన్ పాల్గొన్నారు.

రోబోటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన

చినమడూరు పాఠశాలలో రోబోటిక్‌పై శిక్షణాతరగతులు

దేవరుప్పుల, సెప్టెంబర్ 1: మండలంలోని చినమడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సోహన్ అకాడమీ ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 60 మంది విద్యార్థులకు 16 కృత్యాలపై వివరించారు. సోహన్ అకాడమీ ఫౌండర్ డైరెక్టర్ సహదేవ్ నేతృత్వంలో 16 మంది చురుకైన విద్యార్థులను తదుపరి రోబోటిక్ శిక్షణకు ఎంపిక చేశారు. కెప్టెన్‌గా ప్రజ్ఞ, వైస్ కెప్టెన్‌గా యశ్వంత్ ఎంపికవగా అకాడమీ నుంచి మాడ్యూల్ కిట్లు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కళావతి, నేలపోగుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నవీన్‌కుమార్, టీచర్లు ఆనంద్, ప్రసాద్, వరలక్ష్మి, రాజనారాయణ, సత్యనారాయణ, సుమతి పాల్గొన్నారు

షరతులు లేకుండా పంటరుణాలు మాఫీ చేయాలి

రఘునాథపల్లి, అక్టోబర్ 1: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు షరతులు లేకుండా రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కోమల్లలో మంగళవారం నిర్వహించిన ఆ పార్టీ మహాసభకు బంద రవీందర్ అధ్యక్షత వహించారు. మహేందర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరారు. విజయ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు ఐదు నెలలుగా బిల్లులు ఇవ్వడం లేదని, దీంతో పశువుల దాణ కోసం అప్పులు చేయాల్సి వస్తున్నదన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి రేషన్‌కార్డులు ఇవ్వాలని, రైతుభరోసాను అమలు చేయాలని మహేందర్ డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ కార్యదర్శిగా మలారం వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పొదల నాగరాజు, దాసరి లక్ష్మయ్య, మంద మల్లయ్య, ఆకుల మురళి, తాళ్లపల్లి చెన్నయ్య, యాకూబ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పల్లగుట్ట విద్యార్థి ఎంపిక

సుశాంత్‌ను అభినందిస్తున్న హెచ్ఎం

చిల్వూరు,అక్టోబర్ 1 : మండలంలోని పల్లగుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న జీడి సుశాంత్ ఈ నెల 3 నుంచి 5 వరకు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. దీనికి సంబంధించిన వివరాలను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జే దేవ్‌సింగ్ తెలిపారు. గత నెల 29న చాగల్‌లో జరిగిన జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొన్న సుశాంత్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి అన్నెపు కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కేతిడి నరసింహా రెడ్డి, ఉపాధ్యాయ బృందం సుశాంత్‌ను అభినందించారు.

లారీ బోల్తాపడి ముగ్గురికి తీవ్ర గాయాలు

- బాధితులు వ్యవసాయ కూలీలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

గూడూరులో బోల్తాపడిన లారీ, ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్, అక్టోబర్ 1: అతి వేగంతో అదుపు తప్పి లారీ బోల్తాపడగా ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని గూడూరులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి పాలకుర్తి వైపు ఫ్లైవుడ్‌తో వస్తున్న లారీ అతి వేగంతో గూడూరు సమీపంలో మూలమలుపు వద్ద బోల్తాపడింది. దీంతో గ్రామానికి చెందిన తల్లీకూతురు ఉప్పునూతుల రమ, రమ్యతోపాటు బెల్లి గౌరమ్మ గాయపడ్డారు. వీరు వ్యవసాయ పనుల కోసం బావుల వద్దకు నడుస్తూ వెళ్తుండగా లారీ ఢీకొంది. లారీ మూల మలుపు వద్ద కంట్రోల్ కాకపోవడంతో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయగా కూలీలను ఢీకొని పడిపోయింది. దీంతో ఉప్పునూతుల రమ తలకు, బెల్లి గౌరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను మొదట దవాఖానకు తరలించారు. ఉప్పు నూతుల రమ్య సుమారు గంటన్నర పాటు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతూ లారీ కింద నరకయాతన అనుభవించింది. రమ్య చేయి లారీ కింది భాగాన ఇరుక్కుపోవడంతో ఎస్సైలు ఎం సాయి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో సుమారు గంటన్నర సేపు శ్రమించి రమ్యను బయటికి తీశారు. అప్పటికే ఆమె చేయి నుజ్జునుజ్జయింది. బాధితురాలిని అంబులెన్స్‌లో హనుమకొండలోని దవాఖానకు తరలించారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా సంఘటన స్థలాన్ని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మరోవైపు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి ఫోన్‌లో బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పరంగా అదుకుంటామని హామీ ఇచ్చారు. ఘటనా స్థలాన్ని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ గట్ల మహేందర్‌రెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు చెప్పారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నర్మెట, అక్టోబర్ 1: మండలంలోని కన్నెబోయినగూడెం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పొన్నబోయిన బాలనర్సయ్య అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, డీసీసీ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహ్మారెడ్డి, భూక్యా జయరాంనాయక్, చెవుల పరశురాములు, రాజ్‌కుమార్, భూపాల్‌రెడ్డి, లక్ష్మీ, గోల్కొండ శివ, స్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా సెలవులు : డీఈవో

జనగామ చౌరస్తా, అక్టోబర్ 1 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యా సంస్థలన్నింటికి బుధవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు దసరా సెలవులు ప్రభుత్వం ప్రకటించినట్లు డీఈవో కే రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 రోజుల సెలవుల అనంతరం విద్యార్థులు ఈ నెల 15వ తేదీన తిరిగి పాఠశాలలకు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని కోరారు.